# స్వయంకృతం

- నల్లాన్‌చక్రవర్తుల గోపీమాధవులు

ఈశానః ప్రాణదః ప్రాణోజ్యేష్ఠః ప్రజాపతిః
హిరణ్యా గర్భో భూగర్భో మాధవో మధుసూదనః

టీవీలో ఆనందానందస్వామి విష్ణుసహస్రనామ పారాయణం చూస్తున్న పదేళ్ల కామేష్, కిసుక్కున నవ్వాడు.

"ఏరా, ఎందుకా ఇకిలింపు? అందులో నీకు జోకేం ఉందీ?" వాడి పక్కన సోఫాలో కూర్చుని ఏదో వీక్లీ తిరగేస్తున్న కృప కోపంగా అడిగింది.

వాడు జవాబేమీ ఇవ్వకుండా తల్లివైపు చూసి ఊరుకున్నాడు.

"నువ్వూరుకో కృపా! అన్నిటికీ వాణ్నిలా కసురుకుంటావేమిటి?" అన్నాడు అప్పుడే లోపలికొస్తున్న రఘురామ్.

"ఆ కసురుకుంటున్నా మీ ముద్దుల కొడుకుని" మూతి మూడు వంకర్లు తిప్పింది కృప.

"ఛ, అక్కడికేదో నాకే కొడుకైనట్టూ, తమరికి కానట్టూ..."

"అలాగే ఉంది మీ వరస. వాడేదైనా తప్పుమాట్లాడితే మందలించే అధికారం కూడా మీరు నాకిస్తేగా?"

"అబ్బ కోప్పడకు కృపా! ఇప్పుడు నేనేమన్నాననీ? వాడేం తప్పు మాట్లాడాడని అడుగుతున్నానంతే" సోఫాలో కూర్చుంటూ అన్నాడు రఘురామ్.

ఆనందానందస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం చూస్తూ కామేష్ నవ్విన సంగతి రఘుకి చెప్పింది కృప.

"ఓస్ ఇంతేనా! ఈ మాత్రానికే వాణ్ని గట్టిగా కోప్పడాలాయేం? నీకన్నిటికీ చాదస్తమే. అయినా వాడేది మాట్లాడినా ప్రతి ఫీలింగ్‌లోనూ చాలా డీప్ మీనింగుంటుంది. బికాజ్ హీజ్ బ్రిలియంట్, ఇంటెలిజెంట్ - క్లవర్ లైక్‌మీ" తేలిగ్గా నవ్వేసి అన్నాడు రఘు కృప చెప్పింది విని.

"ఆ డీప్ మీనింగేదో మీరే తెలుసుకోవచ్చుగా!"

తన గురించి పేరెంట్స్ ఇద్దరూ వాదించుకోవడమూ, తండ్రి తనను సమర్థించడమూ చూసిన కామేష్ హుషారుగా వచ్చి రఘు ఒళ్లో కూర్చుని "నానా, నానా! మరే... మరే... ఆ ముసలాయనా... మాట్లాడతుంటే, ఆయన గడ్డమూ... అచ్చు తాటిముంజులాగా ఊగుతోంది. హి...హి...హీ" ముద్దుముద్దుగా పలికాడు.

అది వింటూనే మరోసారి నవ్వేసి రఘు "చూశావుటోయ్ వాడిదెంత షార్ప్ వ్యూనో" కృపతో అన్నాడు గొప్పగా.

"తప్పునాన్నా! పెద్దవాళ్ల గురించీ, దేవుళ్ల గురించీ అలా కామెంట్ చెయ్యొచ్చా. వాళ్లు చెప్పే మంచి విషయాలు విని తెలుసుకోవాలి కానీ. ఎవరి గురించైనా ఏది తోస్తే అది అనేయకూడదు" కొడుకుని దగ్గరకు తీసుకుని కృప చెప్పిన మాటలు వాడి బుర్రను చేరే ప్రయత్నమే చేయలేదు.

'ట్రింగ్...ట్రింగ్' అంటూ ఫోన్ శబ్దం వింటూనే "నేను..నేనూ..." అంటూ పరిగెత్తుకెళ్లి రిసీవర్ తీశాడు కామేష్.

"హలో బాబూ, నేను సృజన్‌కుమార్‌ని మాట్లాడుతున్నాను. మీ డాడీ ఉంటే పిలుస్తావా?" అన్న అవతలి వైపు కంఠం వింటూనే-

"నువ్వేమైనా వాజ్‌పేయివా, చంద్రబాబువా? పేరు చెప్పగానే గుర్తు పట్టడానికి. ఏ సృజన్‌కుమార్‌వో చెప్పూ!"

కామేష్ మానర్‌లెస్ మాటతీరుకి కాస్త ఖంగుతున్న అతను తమాయించుకుని, "మీ డాడీ కొలీగ్‌ని కాషియర్ సృజన్ అని చెప్పు" అన్నాడు.

"ఓహో! ఇప్పుడు గుర్తు పట్టానులే. ఎలా గుర్తు పట్టానని అడగవేం...?" నవ్వుతూ అన్నాడు కామేష్.

నెత్తికెక్కిన చిరాకుని అణచుకుని "బాబూ, ఇంతకీ మీ డాడీ ఉన్నారా, లేరా?" దాదాపు అరచినట్టుగా అన్నాడు సృజన్.

"డాడీ! నీకే ఫోన్. సృజన్‌కుమార్. ముద్దముద్దగా మాట్లాడుతాడు చూడూ, ఆ అంకుల్!" కనీసం మౌత్‌పీస్‌కి చెయ్యి అడ్డం కూడా పెట్టకుండా పెద్దగా అరిచాడు కామేష్.

"ష్..! మెల్లగా" మురిపెంగా నవ్వుతూ వెళ్లి రిసీవర్ అందుకున్నాడు రఘు.

రఘు, కృపల సుపుత్ర రత్నం కామేష్. పెళ్లయిన చాన్నాళ్లకు పుట్టడంవల్లనూ, ఒక్కడే కావడం వల్లనూ, కాస్త అతి గారాబంతో ఆడింది ఆట, పాడింది పాట అన్న చందంగా పెరుగుతున్నాడు.

అప్పుడప్పుడు కృప కాస్త మందలించినా, రఘు ఆ కాస్త మందలింపునూ తేలిగ్గా కొట్టిపారేయడం వల్ల మొత్తానికి అదుపే లేదు కామేష్‌కి.

"ఏమిటండీ, వాడలా పెద్దగా అరుస్తూంటే ఊరుకొంటారూ? అవతలి వాళ్లు వింటే వాళ్ల గురించి మనమలా మాట్లాడుకోవడం విని పిల్లలలా కామెంట్ చేస్తున్నారని అనుకోరూ?" ఫోన్ పెట్టేసి వచ్చిన రఘుతో అన్న కృప మాటలను పెద్దగా పట్టించుకోకుండా ఓ చిర్నవ్వు నవ్వేసి, సోఫాలో కూర్చున్నాడు.

★★★

సాయంత్రం ఆరుగంటలయింది.

ఘంటసాలగారి మధురమైన స్వరం నుండి జాలువారిన భగవద్గీత వెంకటేశ్వరస్వామి కోవెలపైనున్న మైకులో నుంచి శ్రావ్యంగా వినిపిస్తూ ఆ పరిసరాలకు మరింత ప్రశాంతతను చేకూర్చుతోంది.

"నివాస్‌గారూ!" దైవదర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు తీసుకుని గుడి బయటకు వస్తున్న నివాస్, ఆ పిలుపు విని వెనక్కి చూశాడు.

చిర్నవ్వుతో తనను సమీపిస్తున్న రఘురామ్‌ని చూడగానే పలకరింపుగా తానూ నవ్వాడు. రఘురామ్ పనిచేసే బాంక్‌కి ట్రాన్స్‌ఫర్ అయి కొత్తగా వచ్చిన అకౌంటెంట్ నివాస్.

అతని ఇల్లు ఆ ఆలయానికి అరకిలోమీటరు దూరంలో ఉంటుంది.

"ఏం సార్, మీ ఇల్లు ఇక్కడికి దగ్గరేనా?" అడిగాడు రఘురామ్.

"అవునండీ. మెయిన్ రోడ్ పక్కన పార్కు లేదూ అక్కడే" సమాధానమిచ్చాడు నివాస్.

రఘు, ఇద్దరూ మాట్లాడుకుంటూ నడవసాగారు.

★★★

'ట్రింగ్...ట్రింగ్' కాలింగ్ బెల్ మోగిన శబ్దం విని వెళ్లి తలుపు తీసింది కృప. ఎదురుగా భర్తతోపాటు ఎవరో అపరిచితుడు.

"షి ఈజ్ మై బెటర్ హాఫ్ కృప."

చిరునవ్వుతో చేతులు జోడించింది కృప.

నివాస్‌ని తన కొలీగ్‌గా కృపకి పరిచయం చేశాడు రఘు.

హాల్లో సోఫాలో నివాస్‌ని కూర్చోబెట్టి, బట్టలు

మార్చుకోవడానికి లోపలికెళ్లాడు. టీ తేవడానికి కిచెన్‌లోకెళ్లింది కృప.

అప్పుడే ట్యూషన్ నుండి వచ్చిన కామేష్, పుస్తకాల బేగ్ పక్కన పడేసి కుర్చీలో కూర్చున్నాడు.

ఎదురుగా ఉన్న నివాస్‌ని ఓసారి ఎగాదిగా చూసి ఊరుకున్నాడు.

"వాటీజ్ యువర్ నేమ్?" పలకరింపుగా నవ్వాడు నివాస్.

"పుల్లమనేని అల్లయ్య" చెప్పి వెకిలిగా నవ్వాడు కామేష్.



ఆ జవాబుతో కాస్త ఖంగుతిన్న నివాస్ "ఏం చదువుతున్నావు?" అనడిగాడు.

"వంకాయ పులుసు" అంటూ మళ్లీ నవ్వాడు కామేష్.

"ఏమిటండీ నివాస్‌గారూ? మావాడేదో మీకు క్లాస్ తీసుకుంటున్నట్టున్నాడు" అన్నాడు అప్పుడే లోపల్నుండొచ్చిన రఘురామ్.

తన ప్రశ్నలకు కామేష్ ఇచ్చిన పెంకి సమాధానాల గురించి చెప్పాడు నివాస్.

అవన్నీ విని పెద్దగా నవ్వేసిన రఘు "వాడు ఇంటెలిజెంట్ సార్! ఇంకాస్సేపు మీరు వాడితో మాట్లాడితే చాలు. స్టన్నయిపోతారు. వాడిలాగా మాట్లాడ్డం మీకూ నాకూ రాదు తెలుసా?" అన్నాడు.

ఇంటికొచ్చిన గెస్ట్‌లతో అలా మాట్లాడకూడదని కొడుకుని మందలిస్తాడనుకున్న నివాస్, రఘు మాటలకి మరింత ఆశ్చర్యపోయాడు.

★★★

"మిస్టర్ రఘూ! ఆర్యూ బిజీ?" రఘురామ్ సీటు దగ్గరకొచ్చి అన్నాడు నివాస్.

"లేదండీ, చెప్పండి" అంటూ ఎదురుగా ఉన్న కుర్చీని చూపించాడు రఘురామ్.

"మీ పర్సనల్ విషయాలు పట్టించుకుంటున్నానని మరోలా అనుకోకపోతే..." అర్థోక్తిలో ఆగిపోయాడు నివాస్.

"నో...నో...నాటెటాల్! యూ ఆర్ సీనియర్ మోస్ట్. చెప్పండి" అన్నాడు రఘురామ్.

"మిస్టర్ రఘూ! పిల్లల మనసులు మైనపు ముద్దల్లాంటివి. ఆ మైనంతో ఒసామాబిన్ లాడెన్‌నీ తయారుచేయవచ్చు. ఓ మదర్ థెరిస్సానీ చేయవచ్చు. మన పిల్లలమీద మనకు ప్రేమాభిమానాలుండవచ్చు. కానీ అవి వికటించి వాళ్లు సంస్కారహీనులయ్యే ప్రమాదమేర్పడకుండా చూసుకోవాలి.

మొక్కై వంగనిదే, మ్రానై వంగునా అని మన తాతలనాడు ఓ సామెత ఉండేది. పాతదే అయినా ప్రతి తరానికీ పనికి వచ్చే సూక్తి అది..." నివాస్ ఇవన్నీ ఎందుకు చెబుతున్నాడో అర్థమైన రఘు మొహంలో రంగులు మారాయి.

★★★

ఆ ఇంట్లో విషాదం రాజ్యమేలుతోంది. ఆ ఇంటి యజమాని నర్సయ్య చనిపోయి అప్పటికి తొమ్మిది రోజులయ్యింది.


తెల్లవారితే దశదినకర్మ నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

"మావయ్యా! నాకు ట్వెంటీ రుపీస్ కావాలి" తల్లి దగ్గర కూర్చుని ఏదో మాట్లాడుతున్న కృష్ణ దగ్గరకొచ్చి అడిగాడు కామేష్.

"ఎందుకురా ఇప్పుడూ? తర్వాతిస్తానులే వెళ్లు!" అన్నాడు కృష్ణ.


"ఊ... ఇప్పుడే కావాలి. నాకు బోర్ కొడుతోంది.. వెళ్లి వీడియో గేమ్ ఆడుకుంటా" మారాం చేశాడు కామేష్.

"అబ్బ...! వెళ్లరా తర్వాతిస్తానని చెప్పాగా?" విసుక్కొన్నాడు కృష్ణ.




## మధురానుభూతి

సినీ ఇండస్ట్రీలో పెద్ద తారలతో కలిసి నటించడం మరచిపోలేని అనుభవాన్ని మిగుల్చుతుంది. నవీనతార పెరిజాద్ కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వెల్లడిస్తోంది. 'ఓంపురి, విక్టర్ బెనర్జీ, షబానా అజ్మీ వంటి సీనియర్స్‌తో కలిసి నటించడం నాకెంతో తృప్తినిచ్చింది. షూటింగ్ స్పాట్‌లో నేను విద్యార్థినిలా అన్నీ గమనిస్తాను. ఇండస్ట్రీలో కొత్త హీరోయిన్‌ని కాబట్టి కొన్నాళ్ళు అన్నిటినీ గమనించాల్సిందే. సీనియర్స్‌తో పాటూ నటించేటప్పుడు కొంచెం ఇబ్బందిపడినా, వారి సలహాలు, వారి అనుభవాల్ని పంచుకుంటే ఎంతో బాగుంటుంది. వారు చెప్పినట్టు చేస్తే ముమ్ముందు మన టాలెంట్‌ని పెంచుకునేందుకు వీలు కలుగుతుంది' అంటోంది జొరాబియన్.



"ఉండు... నీ పనిచెప్తా!" అని అక్కడ్నించి వెళ్లిపోయాడు కామేష్.

ఆ సంఘటన అనూహ్య పరిణామాలకు దారితీస్తుందని అక్కడెవరూ ఊహించలేకపోయారు.

"ఏమోయ్ కృష్ణా! ఎంతవరకొచ్చాయి పనులూ...?" అప్పుడే ఆఫీసునుండొచ్చిన రఘురామ్ అడిగాడు బావమరిది కృష్ణని.

"అవుతున్నాయి బావగారూ! ఒకసారి రామశాస్త్రిగారికి మళ్లీ ఫోన్ చెయ్యాలి. ఇంకా..." అంటూ ఏదో చెప్పబోయిన కృష్ణని లోపల్నుండి ఎవరో పిలవడంతో వెళ్లాడు.

ఈలోగా కామేష్ తండ్రి దగ్గరకూ రావడమూ ఏదో చెప్పడమూ, రఘురామ్ కోపంతో బుసలు కొట్టడమూ క్షణంలో జరిగిపోయాయి.

"ఏమయ్యా కృష్ణా! ఏమిటీ నన్నేదో అన్నావుట?" కోపంగా అడిగాడు రఘు.

తనను బావమరిది 'యూజ్‌లెస్‌ఫెలో' అని తిట్టాడన్న నెపంతో రఘు గట్టిగా అరిచి కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న బంధువులు సైతం ఆశ్చర్యపోయారు.

అసలు తను ఆ మాట అనేంత సందర్భమేమొచ్చిందో ఎంత ఆలోచించినా గుర్తుకురాలేదు కృష్ణకు.

అదేమాట చెప్పాడు.

"అంటే అంతమాట నువ్వు నన్ననందే నా కొడుకు అబద్ధం చెప్పాడంటావా?" అరిచాడు రఘు.

"వాడేదో పొరబాట్న చెప్పుంటాడు. అయినా ఇంతమంది ముందు మనం సిల్లీ పాయింట్ గురించి గొడవపడడం మర్యాదగా ఉండదు ప్లీజ్" రిక్వెస్టింగ్‌గా అన్నాడు కృష్ణ.

కృష్ణ తమ్ముళ్లిద్దరూ వచ్చి ఇక్కడ జరగబోయేదేం శుభకార్యం కాదు గనుక. ఇక్కడ తప్పొప్పులూ, మర్యాదలకు తావు లేదనీ, అయినా విషయమేదైనా, తర్వాత పర్సనల్‌గా మాట్లాడుకుంటే మంచిది కానీ ఇలా రభస చేయడం బావుండదనీ అభ్యర్థించారు.కారణమేదైనా పరిస్థితులేవైనా తన భర్త వైపే వాదించడం చాలామంది ఆడవాళ్లకు సహజమే కనక కృప కూడా సహజదూరంగా ఏమీ ప్రవర్తించలేకపోయింది.

అప్పటికప్పుడే అక్కడి నుండి ప్రయాణమయ్యారు ముగ్గురూ.

***

"ఎందుకురా, మామ మీద డాడీకి చాడీలు చెప్పి ఇంత గొడవ సృష్టించావు?"

బస్సులో కూర్చున్నాక కొడుకుని అడిగింది కృప.

"మా బాగా అయ్యింది. లేకపోతే వీడియో గేమ్ కోసమని ట్వెంటీ రుపీస్ అడిగితే ఇవ్వనంటాడా" అన్న కామేష్ మాటలు విని ఆశ్చర్యపోవడం రఘు, కృపల వంతయింది.

అయినా అదంతా వట్టిదేననీ చిన్నపిల్లాడి మాటలువిని నిజమో కాదో తెలుసుకోకుండా గొడవ పడడం తమదే తప్పనీ మళ్లీ వెనక్కి వెళ్లాలంటే అభిమానం అడ్డొచ్చింది.

"డాడీ...డాడీ! మరే... ఆ అంకులూ ఈ రోజు మళ్లీ వచ్చారు" మెల్లిగా తండ్రితో చెప్పాడు కామేష్.

"ఏ అంకుల్ కన్నా!" అడిగాడు రఘురామ్.

"అమ్మో...చెప్తే అమ్మ నన్ను చంపేస్తుంది"

ఆ మాటతో రఘురామ్‌లో ఉత్సుకత పెరిగింది.

"ఎవర్రా ఆ అంకుల్? చెప్పు. నీకు ఐస్‌క్రీమ్ కొనిపెడతా"

"మరే నాన్నా. నువ్వు లేనప్పుడూ ఓ అంకుల్ వస్తుంటాడే ఆ అంకుల్ రాగానే అమ్మ నన్నూ... బయటకు వెళ్లి ఆడుకోమంటుంది. మళ్లీ ఈ రోజు కూడా వచ్చాడు ఆ అంకుల్"

సరదాకో చిన్నతనంవల్లనో కామేష్ నాటిన విషబీజం భీభత్సమైన ఫలితాన్నే ఇచ్చింది. అది రఘు, కృపలు గొడవపడి కృప ఇల్లొదిలి తల్లిగారింటికి వెళ్లిపోయేదాకా సాఫీగా సాగిపోయే వారి సంసారం శృతి తప్పి రఘు తప్పతాగే స్థితికి చేరుకునేదాకా దారితీసింది.

***

"ఇప్పటికైనా ఒప్పుకుంటావా, మా డాడీకి నేను ఎంత చెబితే అంతే!" కామేష్ అంటున్నాడు.

"నిజమేరోయ్. నువ్వే విన్నయ్యావు. అయినా మీ నాన్న మీ అమ్మని తన్ని బయటకి తరిమేస్తుంటే అంతమంది జనం మీ ఇంటి ముందు గుమిగూడితే నీకేమనిపించలేదురా?"

"ప్చ్...! చాలా బాధా, భయమూ కలిగిందిరా. కానీ అంతవరకూ వచ్చిన తరువాత అదంతా ఉత్తుత్తినే చెప్పానని అంటే మా డాడీ తంతారని భయమేసి ఊరుకొన్నా"

అప్పటికి రెండు విస్కీ బాటిల్స్ ఖాళీ చేసి మంచం మీద పడి ఉన్న రఘుకి పక్క గదిలోంచి కొడుకు తన ఫ్రెండ్‌తో అంటున్న మాటలు లీలగా వినిపిస్తుండగా మత్తులోకి జారుకున్నాడు. అపస్మారక స్థితిలోకి అదుపు తప్పిన అగాధపు స్థితిలోకి.

★